కామెడీ కథ

# ఆయనంతే... దట్సాల్!

**డెబ్బయ్ ఆరేళ్ల కాణిపాకం హాస్పిటల్ బెడ్‌మీద పడుకొని, కళ్లు టపటపలాడిస్తూ, నర్సుల వంక 'వేరీజ్ డాక్టరూ...' అన్నట్టు ఎక్స్‌ప్రెషనిచ్చాడు. నర్సులు తెగ సిగ్గుపడిపోతున్నారు ఆయన చూపును మరోలా అర్థం చేసుకుని. వెంటనే శ్రీమతి కాణిపాకం జోక్యం చేసుకుని...**

''అయ్యయ్యో... ఆయన చూపుల్ని తప్పుగా అనుకోకండమ్మా... ఆయనంతే... ఆయనకు హాస్పిటల్‌ని చూసినా, నర్సుల్ని, డాక్టర్లను, సర్జరీ చేసే సర్జన్లను చూసినా కళ్లల్లో ఆనందం, గుండె నిండా సంతోషం వచ్చి చేరుతాయి'' చెప్పింది.

నర్సులు మాత్రం కాణిపాకం వంక అడ్మయిరింగ్గా చూస్తూనే వున్నారు. ఈలోగా ఓసారి చిన్న ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్లిపోయింది శ్రీమతి కాణిపాకం.

సరిగ్గా రాత్రంటే రాత్రే... తొమ్మిది గంటలకు తను మొగుడి కోసం ఫిల్టర్ కాఫీ పట్టుకెళ్లింది. అదే సమయంలో మొగుడు ఆయుర్వేదం, అల్లోపతి, హోమియోపతి మొదలు, ఆకుపసర్లు, చిలకడ దుంపలు, ఇంగ్లీషు మందులు... అన్నీ తన చుట్టూ పరుచుకుని ''ఇది ఉదయం నాలుగ్గంటలకు, ఇది నాలుగున్నరకు... అది అయిదు గంటలకు, ఇది అయిదున్నరకు... అంటూ ఏయే మందులు ఎప్పుడెప్పుడు వేసుకోవాలో తనకు తనే డైలీ సీరియల్‌లో గంటలకొద్దీ స్వగతంగా పాత్రలు మాట్లాడుకునే టైప్‌లో చెప్పేసుకుంటున్నాడు.

శ్రీమతి కాణిపాకం ఎప్పటిలానే తల పట్టుకుంది. మొగుడి బాడీలో రోజూ తినే ఆహార పదార్థాల కన్నా, ఏసుకునే మాత్రల పరిమాణమే ఎక్కువుంటుందన్నది ఆమె స్థిరమైన నమ్మకం.

శ్రీమతి కాణిపాకం ఫ్లాష్‌బాక్‌లో నుంచి మరో ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్లింది. ఆ ఫ్లాష్‌బాక్‌ని కాణిపాకం చిన్నప్పట్నుంచీ రివీల్ చేసుకుంది.

కాణిపాకం చిన్నప్పటి ఫ్లాష్‌బాక్ శ్రీమతి కాణిపాకానికి ఎలా తెలిసిందన్న డౌటొద్దు... ఆ ఫ్లాష్‌బాక్‌ని కాణిపాకం మేనత్త చెప్పగా తెలుసుకుందని గమనించాలి.

★ ★ ★

కాణిపాకం హాస్పిటల్‌లో పుట్టాడు సింబాలిక్గా. అంతకన్నా సింబాలిగ్గా కాణిపాకం పుట్టడంతోనే నర్సు చేయి పట్టుకున్నాడు. అన్నప్రాసన రోజున పుస్తకాలు, డబ్బులు, స్వీట్స్, బట్టలు లాంటివి వదిలి... పాక్కుంటూ ఓ మూలకు వెళ్లి అక్కడున్న మేనత్త మందులను పట్టుకున్నాడు.

అదిగో అప్పట్నుంచీ కాణిపాకం లైఫ్ స్టయిల్ మారిపోయింది. జనరల్‌గా చిన్నపిల్లలు చందమామని చూపిస్తేనో, చాక్లెట్‌ని కొనిస్తేనో మారాం మాని బుద్ధిగా అన్నం తింటారు. కాణిపాకం మాత్రం మాత్రల సీసా చేతిలో పెడితే కామైపోతాడు. అందర్లా పిక్నిక్‌కో, జూకో, సర్కస్‌కో తీసుకువెళ్తామని చెబితే పిల్లలు శ్రద్ధగా చదువుతారు.

కాణిపాకం విషయంలో క్వయిట్ ఎగైనెస్ట్... ఎంటర్ ది డ్రాగనే... హాస్పిటల్‌కు తీసుకువెళ్తేనే బుద్ధిగా చదువుకుంటానని మారాం చేసేవాడు. ఓరోజు హాస్పిటల్‌కు తీసుకువెళ్లడం లేదని మేనత్త చేతుల్ని చిన్నపాటి సుత్తితో చిట్లగొట్టేసాడు. ఆ విధంగా మేనత్తకు చిట్లిపోయిన చేయి ట్రీట్‌మెంట్ కోసం... ఆవిడ్తోపాటు హాస్పిటల్‌కు వెళ్లాడు.

అదేదో అడ్వర్టయిజ్‌మెంట్‌లాగా మెడిసిన్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ అయిపోయింది కాణిపాకం లైఫ్ స్టయిల్.

నెలకోసారి కడుపునొప్పి అని, పదిహేను రోజులకోసారి కాళ్లనొప్పులూ, వారానికోసారి తలనొప్పని హాస్పిటల్‌కు వెళ్లేవాడు. ఇవన్నీ ఇరవయ్యేళ్లపాటు చూసి చూసి భరించిన తల్లి మెంటలెక్కి, మొగుడ్ని పట్టుకొని, ''బాగున్నావా మావయ్యా? ఎప్పుడొచ్చావు?'' అంటూ పలకరించడం మొదలుపెట్టింది. వెంటనే కాణిపాకం తెగ సంతోషపడిపోయి తల్లిని మెంటల్ హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు. అతనికి హాస్పిటల్ చూస్తే చాలు... ప్రాణం లేచొస్తుంది. అది ఏ హాస్పిటల్ అయినా తరతమ బేధం లేకుండా!

ఓ ఫైన్ మార్నింగ్ తల్లి, బ్యాడ్ ఈవినింగ్ తండ్రీ టపా కట్టేసారు. మేనత్త భయపడుతూనే కాణిపాకం పెళ్లి చేసి, ఇంకా అక్కడే వుంటే హాస్టిటల్ పిచ్చితో తన తల బద్దలుకొట్టి హాస్పిటల్‌కు తీసుకువెళ్తాడనే భయంతో, కాశీకి వెళ్తానని వెళ్లి, అక్కడ్నుంచి అటే పైకెళ్లిపోయింది.

★ ★ ★

కాణిపాకం హాస్పిటల్ మెంటాల్టీ దినదిన ప్రవర్ధమానమైంది. అతి జాగ్రత్త పరాకాష్టకు వెళ్లింది. అతని జీతంలో సింహభాగం హాస్పిటల్ టెస్ట్‌లకు, మందులకే సరిపోయింది. ఓ దశలో శ్రీమతి కాణిపాకానికో ఐడియా కూడా వచ్చింది. తన తమ్ముడి చేత మందుల షాపు పెట్టిస్తే ఎలా వుంటుంది? అన్న ఐడియా అది.

ముచ్చటగా ముగ్గురు మగపిల్లలు నాన్‌స్టాప్‌గా సంవత్సరానికొక్కరు పుట్టుకొచ్చారు. ఆడపిల్లలు పుడితే అబ్బాయి కోసం ఎదురుచూడ్డం రివాజు... మగపిల్లలు పుట్టినా, అదీ ముగ్గురు పుట్టినా, చిద్విలాసంగా భార్య వైపు చూసి ప్రొసీడ్... అన్నాడు. దాని రిజల్ట్ 'ఐదు' వరకూ వచ్చి పంచపాండవుల దగ్గర సెటిలైంది. ఎందుకలా చేయవలసి వచ్చిందో ఓ ఫైన్ నైట్ చెప్పేసాడు కాణిపాకం తన బెస్ట్‌హాఫ్ భార్యకి. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేస్తే ఒక్కసారితో హాస్పిటల్ పని అయిపోతుంది. అదే పిల్లల్ని కంటూపోతే... సంవత్సరానికోసారి ప్రసవానికి, నెలకోసారి చెకప్‌కు తీస్కెళ్లొచ్చు... రోజూ మాత్రలు వేయొచ్చు... అతనా రూట్‌లో ఎంతగా డెవలప్ అయ్యాడంటే... సిటీ మొత్తంలో ఏ డాక్టర్‌కైనా, ఏ మాత్రల గురించైనా తెలుసుకోవాలంటే... వెంటనే...

''కాణిపాకంగారూ... ఈ మందులు ఏ ఫార్ములా... ఏ బ్యాచ్... ఏ కంపెనీ...'' అంటూ వివరాలు అడిగేస్తారు. అంత థరోవ్.

డెలివరీ కోసం భార్య హాస్పిటల్‌కు వెళ్తే ''సిజేరియనా... సిజేరియనా?'' అని తెగ ఆతృత పడిపోయి ఆశగా అడిగేవాడు.

సిటీలో వుండే డాక్టర్లకు సంబంధించిన టెలిఫోన్ నెంబర్లు, అడ్రస్‌లు, అంబులెన్స్ నెంబర్లు కంఠతా వచ్చు కాణిపాకానికి.

★ ★ ★


పిల్లలకు చిన్న జ్వరం వచ్చినా, హాస్పిటల్‌కు తీసుకువెళ్లేవాడు. తనకైతే ఏం రాకపోయినా... హాస్పిటల్‌కు వెళ్లి చెకప్ చేయించుకోవడం... ఎక్స్‌రేలు తీయించుకోవడం చేసేవాడు. చివరికి చిన్నవాడికి ఇంజనీరింగ్ సీటుకు డబ్బులు లేకపోతే మొగుడు పెళ్లయినప్పట్నుంచీ తీయించుకున్న ఎక్స్‌రే ఫిల్ములు అమ్మేసి, ఇంజనీరింగ్ సీటుకు


డబ్బులు కట్టింది భార్య.

ఓరోజు కాణిపాకం బావమరిది వచ్చాడు. రాత్రి పడుకునే ముందు గార్డినల్ మాత్రలు మూడు వేసుకోవడం చూసి...

''బావా... నిద్రమాత్రలు వేసుకుంటున్నావేంటి?'' అని అడిగాడు.

''నిద్ర కోసం...''





చెప్పాడు కాణిపాకం.

''మధ్యాహ్నం గంటసేపు నిద్రపోతావు. సాయంత్రం ఓ కునుకు తీస్తావు. రాత్రి టీవీలో వార్తలు చూడ్డంతోనే గుర్రుపెడతావ్‌గా'' అన్నాడు.

''అవుననుకో... ఒకవేళ నిద్ర పట్టకపోతే ఈ మాత్రలు పనిచేస్తాయిగా''

''అందుకు మూడు మాత్రలెందుకు?''

''ఒకటి పనిచేయకపోయినా, మరోటి పని చేస్తుందని...''

ఆ తర్వాత కాణిపాకం బావమరిది ఎప్పుడూ బావగారిని చూడ్డానికి రాలేదు. అనుకోకుండా ఎదురుపడినా పిచ్చి చూపులు చూస్తూ పక్కకు తప్పుకునేవాడు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే అతి జాగ్రత్త... అతి... అతి... అతి... ఆరోగ్యం పట్ల అతి శ్రద్ధ... అదే వికటించి, అతన్ని 'మందు' ప్రియుడ్ని, హాస్పిటల్ 'అతిథి'ని చేసింది.

★ ★ ★

పిల్లల పెళ్ళిళ్లయిపోయేయి.

తన ఛాదస్తంతో పిల్లలకు మెంటలెక్కించాడు. అయిదుగురు కోడళ్లు ఏకగ్రీవంగా తేల్చి చెప్పేసారు. ''అత్తయ్యా... మామగారి అతి ఆరోగ్య శ్రద్ధ భరించలేము... మామీదా, మా పిల్లల మీదా ఈ ప్రయోగాలకో దండం...'' అంటూ రెండు చేతులు జోడించారు.

వెంటనే కాణిపాకం రెండడుగుల ఎత్తున లేచి, ''ఛాఠ్... నన్నంటే పడతానుగానీ, నా ఆరోగ్యం గురించి, నేను తీసుకునే శ్రద్ధ గురించి అంటారా? మీరు కోడళ్లు కాదు... నేను మామనీ కాదు...'' అంటూ ఓల్డేజ్ హోమ్‌కు భార్యతోసహా వెళ్లిపోయాడు.

అక్కడ కూడా తన అలవాటు మానుకోలేదు. ప్రపంచంలో వున్న మందుల కంపెనీల మందులన్నీ అతనికి తెలుసు. ఓల్డేజ్ హోమ్‌లో వున్న వాళ్లందరికీ 'మందోపదేశం' చేస్తుంటాడు. ఎక్స్‌రేల ఆవశ్యకత, మెడికల్ చెకప్‌ల ప్రాశస్త్యం చెబుతూ వుంటాడు.

అలాంటి కాణిపాకానికి... ఓ రాత్రి అనుకోకుండా హార్ట్ ఎటాక్... ఎటాకైంది. దేర్ ఎండ్స్ ద ఫ్లాష్‌బాక్.

★ ★ ★

ఒక్కొక్కరు వచ్చి శ్రీమతి కాణిపాకాన్ని ఓదారుస్తున్నారు. కోడళ్లు కొంగులు నోట్లో కుక్కుకుని నవ్వుకుంటున్నారు. కాణిపాకం తనని ఓదార్చేవాళ్లని చూసి ''ప్చ...'' అనుకుంటున్నాడు. కొడుకులు తామెలా రియాక్టవ్వాలా? అని ఆలోచిస్తున్నారు.

**శకుంతల**

★ ★ ★

డాక్టర్ తీటారావు వచ్చాడు. కాణిపాకానికి హార్ట్ ఎటాక్ వచ్చిందన్న విషయం నర్సులు చెప్పినప్పట్నుంచీ తెగ ఆనందంగా వుంది. ఎంతలేదన్నా ఒకట్రెండైనా గిట్టుబాటు అవుతాయని ఆశ. కాణిపాకాన్ని చూస్తూనే ఎదురెళ్లి కావులించేస్కున్నాడు.

''ఎన్నాళ్లకెన్నాళ్లకు మామీద దయ కలిగింది...'' అన్నాడు బొటబొటా కన్నీళ్లు కారుస్తూ.

''నేనొచ్చేసానుగా...'' అన్నాడు కాణిపాకం డాక్టర్‌ని టెన్షన్ పడొద్దన్నట్టు. డాక్టర్ సిగ్గుతో కాణిపాకాన్ని వదిలేయగానే, నర్సులు తమకూ ఆ ఛాన్స్ వస్తుందేమోనని కాణిపాకం దగ్గరికి వెళ్లారు.

ప్రమాదాన్ని పసిగట్టిన శ్రీమతి కాణిపాకం అడ్డుపడింది.

★ ★ ★

డాక్టర్ తీటారావు, మరో డాక్టర్ తిప్పారావుతో కలిసి, గంభీరంగా కాణిపాకం కొడుకుల వైపు చూసి చెప్పాడు.

''సిట్యుయేషన్ ఈజ్ వెరీ సీరియస్...''

''ఎంత సీరియస్... లక్ష సీరియస్సా... రెండు లక్షల సీరియస్సా?'' అడిగాడు పెద్దకొడుకు తమకది అలవాటే అన్న లెవెల్లో ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి.

''వెంటనే నాలుగైదు... ఆరేడు... అని, వారం పది రోజుల్లో హార్ట్ సర్జరీ చేయాలి... అప్పటి దాకా అబ్జర్వేషన్‌లో వుంచాలి... ఈలోగా డబ్బు రెడీ చేస్కోండి... అన్నట్టు ఓ లక్ష డిపాజిట్ చేయండి... మా చిన్నమ్మాయికి మారుతీ కావా

అట...'' అనేసి నాలిక్కొర్చుకున్నాడు.

శ్రీమతి కాణిపాకం బ్లాంక్‌గా మొగుడి వైపు చూస్తోంది. కాణిపాకం కళ్లు తెరిచి, లోపలికి విషాద వదనాల్తో వచ్చిన కొడుకులను చూసి ''డాక్టర్లు ఆపరేషన్ చేస్తానన్నారా...? గాడ్ ఈజ్ గ్రేట్...'' అన్నాడు తెగ హేపీగా ఫీల వుతూ...

పక్క బెడ్ మీద వున్న పేషెంట్‌కి ఫిట్స్ మొదలయ్యాయి ఈ సిట్యుయేషన్ చూసేక.

★ ★ ★

ఐసియులో వున్న కాణిపాకం... అర్ధ రాత్రి తాపీగా నడుచుకుంటూ స్కానింగ్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి... తన బాడీని టోటల్‌గా స్కాన్ చేయించుకున్నాడు. కావలసినన్ని ఎక్స్‌రేలు తీయించుకున్నాడు. ఐసియు బయట నిద్రపోతున్న భార్యను లేపి ''నువ్వు కూడా స్కాన్ చేయించుకుంటావా?'' అని అడిగేడు. ఆ దృశ్యం మొదట్నుంచీ గమనిస్తోన్న వార్డ్‌బోయ్‌కు ఝుడుపు జ్వరం వచ్చింది.

★ ★ ★

ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లేముందు అడిగాడు.

''డాక్టర్‌గారూ... మీరు హార్ట్ సర్జరీ చేస్తోంటే నేను చూడొచ్చా...?'' ఎంతో గుండె ధైర్యం వున్న డాక్టర్ కూడా ఆ ప్రశ్న విని బెదిరిపోయాడు.

''మరో డౌట్...'' అన్నాడు కాణిపాకం.

ఏమిటి? అన్నట్టు చూసేడు డాక్టర్ భయం భయంగా.

''వన్ ప్లస్ వన్ పద్ధతిలో ఒక ఆపరేషన్ చేస్తే మరొకటి ఫ్రీ లేదా? ఈ ఆపరేషన్ చేయించుకుంటున్నందుకు మరేదైనా ఆపరేషన్ ఫ్రీగా చేయొచ్చుగా''


డాక్టర్ చేతులు జోడించి... ''మీకు చేయడానికి మిగిలి వున్న ఆపరేషన్ ఒకటే... 'ఫ్యామిలీ ప్లానింగ్' చెప్పాడు.

''అయితే అది కూడా చేసేయండి పనిలో పనిగా'' అన్నాడు డెబ్బయ్ ఆరేళ్ల కాణిపాకం ఆనందపడిపోతూ.

★ ★ ★

కాణిపాకం హార్ట్ సర్జరీ పూర్తయింది. శ్రీమతి కాణిపాకం ఆ రాత్రి భర్తకు యాపిల్ ముక్కలు తినిపిస్తూ వుంది. ఈలోగా డాక్టర్ తీటారావు, తిప్పారావులు వచ్చారు.


''థాంక్సండీ...! మా వారికి హార్ట్ సర్జరీ చేసి, నా మంగళ సూత్రాలు నేల రాలకుండా చేసారు'' అంది మంగళ సూత్రాలు కళ్లకద్దుకుంటూ.




వెంటనే కాణిపాకం పెద్ద పెట్టున నవ్వేస్తూ, ''పిచ్చిదానా... డాక్టర్ నాకు హార్ట్ సర్జరీ ఉత్తిత్తినే చేసుంటారు. అసలు నాకు హార్ట్ ఎటాక్ వస్తే కదా... పిల్లలు హాస్పిటల్‌కు తీసుకెళ్లడం లేదని... ఎడమ వైపు గుండె వుండే, కుడివైపు చేత్తో పట్టుకొని గుండెల్లో నొప్పి అన్నాను. అంతే... నా హార్ట్‌కేం... నిక్షేపంగా వుంది'' అన్నాడు హార్ట్ సర్జరీ ప్లస్ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ జాయింట్‌గా, సరదాగా చేయించేస్కున్న కాణిపాకం.

అదిగో అప్పుడు...

ఇనుప గుండ్ల లాంటి గుండెలున్న ఆ ఇద్దరు డాక్టర్ల గుండెలు రకరకాల స్పీడుతో కొట్టుకోవడం మొదలెట్టాయి. ఇప్పుడా డాక్టర్లకు హార్ట్ సర్జరీ లేదా యాంజియోప్లాస్ట్ తప్పనిసరి... అదీ సంగతి!



## దూరం...దూరం

**పార్టీలకి పిలిస్తే ఎవరైనా రానని అంటారా? రవీనా అయితే రాననే అంటోంది. ప్రత్యేకంగా సినిమా ఫంక్షన్లకి దూరంగా ఉంటానంటోంది రవీనా. దీనికి కారణం మీరిప్పటికే కనుక్కొని ఉంటారు. ఎందుకంటే ఆమె ఎక్కడికెళ్లినా ఎవరితో ఒకరితో సంబంధం ఉన్నట్టు రాసేస్తున్నాయి పత్రికలు. అందుకే ఇలాంటివాటికి అవకాశం ఇవ్వకుండా ఉంటే మంచిదని భావించి తానే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అనిల్ తడానీతో తాను తెగ తిరుగుతున్నట్టు జనం కోడై కూస్తుండడంతో ఇలా ప్రవర్తిస్తోంది. ఆఖరికి తన సొంత సినిమాల ఫంక్షన్లకి కూడా ఆమె దూరం పాటిస్తోంది. ఇలా ఎన్నాళ్ళు రవీనా!**

(కొందరికి మందులు మింగడమన్నా, అదే పనిగా హెల్త్ చెకప్‌లు చేయించుకోవడమన్నా సరదా... 'అతి జాగ్రత్త' ఛాదస్తంగా మారి హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ, జబ్బు వున్నా లేకపోయినా మందులు మింగుతూ వుంటారు. అలాంటి క్యారెక్టర్లను చూసి రాసిన కథ ఇది.

డాక్టర్లని కించపరిచే ఉద్దేశమేమీ లేదు. సరదాగా రాసినది.

- రచయిత్రి